ప్రజాశక్తి
మంగళవారం 10 డిసెంబర్ 2024
8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

వినియోగదారులపై ఛార్జ్

◆ కూటమి ప్రభుత్వం దొంగ దెబ్బ ◆ ఎఫ్‌పిపిసిఎల పేరిట విద్యుత్ బిల్లుల వడ్డన



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

తాము అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచబోమని ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం నేడు చాపకింద నీరులా భారాలు వేస్తోంది. నాడు జగన్ ప్రభుత్వం అనుసరించిన విధానాలను చంద్రబాబు సర్కారూ అనుసరిస్తూ జనంపై విద్యుత్ బిల్లుల భారాన్ని మోపుతోంది. ఎఫ్‌పిపిసిఎల పేరిట వినియోగదారులకు షాక్ ఇస్తోంది.

విశాఖ నగరంలో నవంబర్ నెలలో ఇళ్ల వద్ద లేని ప్రజలకు సైతం రూ.300 వరకూ బిల్లు రావడం విస్మయం గొలుపుతోంది. ఇటువంటి బిల్లులపై అభ్యంతరాలు కూడా వచ్చాయని ఒక అధికారి 'ప్రజాశక్తి'కి సోమవారం తెలిపారు. గతంలో వాడిన యూనిట్లపై తాజాగా భారాలు పడుతున్నాయని ఆయన అంగీకరించారు.

సామాన్యులకు తప్పని కష్టాలు

ఎఫ్‌పిపిసిఎ - 2 ఛార్జీల పేరిట నగర వాసులపై భారం పడుతోంది. కెఆర్ఎం కాలనీ ప్రాంతంలో సర్వీస్ నెంబర్ 112841హెచ్‌బి050543266కి సంబంధించి అక్టోబర్ నెల 151 యూనిట్లకు రూ.798 కరెంటు బిల్లు రాగా నవంబర్‌లో 87 యూనిట్లకు రూ.653 కరెంట్ బిల్లు వచ్చింది. అంటే అక్టోబర్ నెలలో సగటున యూనిట్‌కు రూ.5.28 బిల్లు పడింది. అదే నవంబర్ నెలకు వచ్చేసరికి యూనిట్‌కు 7.50 వచ్చింది. ఈ క్రమంలో ఒక్కొక్క యూనిట్‌కు రూ.2.22 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ వేసింది. ఈ విషయమై వినియోగదారుడు స్పందిస్తూ కూటమి నాయకులు ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి నేడు ఇలా భారాలు వేయడం అన్యాయమని అన్నారు. నిత్యావసర ధరలతో పాటు విద్యుత్ ఛార్జీలు ఇలా పెరిగితే సామాన్యుడు ఎలా బతుకుతాడని ప్రశ్నించాడు.

విద్యుత్ శాఖ ఇంజినీర్ ఏమన్నారంటే..

'బయట ఎక్కువ పెట్టి విద్యుత్‌ను కొనడం వల్ల ఆ ఛార్జీల మోత జనం మోయాల్సి వస్తుంది. గతంలో వినియోగదారులు వాడిన కరెంట్‌కు ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీల పేర ఇప్పుడు బిల్లులు జమ అవుతున్నాయి' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ విద్యుత్ శాఖ ఇంజినీర్ తెలిపారు.



డెయిరీ కార్యాలయంలో అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న సభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూ

విశాఖ డెయిరీలో సభా సంఘం పర్యటన

యాజమాన్యం అవినీతి, అక్రమాలపై ఆరా

ప్రజాశక్తి - గాజువాక, ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ విలేకరులు

విశాఖ డెయిరీపై ముసురుకున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై విచారణ జరిపేందుకు శాసన సభా సంఘం సోమవారం డెయిరీలో విస్తృతంగా పర్యటించింది. సభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూ నేతృత్వాన కమిటీ సభ్యులు పల్లా శ్రీనివాసరావు, బొండా ఉమామహేశ్వరరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గౌతు శిరీష, ఆర్‌విఎస్‌కెకె.రంగారావు, దాట్ల సుబ్బరాజు డెయిరీలో కలియదిరిగి నిశితంగా అన్నింటినీ పరిశీలించారు. మూడు గంటల పాటు వివిధ రికార్డులను పరిశీలించారు. ప్లాంట్‌లో ప్రాసెస్ యూనిట్‌ను తనిఖీ చేశారు. డెయిరీ అధికారులతో సమావేశమయ్యారు. పలు విషయాలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ పరిశీలన తరువాత తమకు మరిన్ని సందేహాలు పెరిగాయని తెలిపారు. భవిష్యత్తులో నిపుణుల కమిటీ వేసి సమగ్ర దర్యాప్తు జరుపుతామన్నారు. అనంతరం విశాఖ కలెక్టరేట్‌లో సభా సంఘం అధికారులతో సమావేశమైంది. పాల రైతు సంఘాల నాయకులు, పాడి రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించింది.

పాల రైతుల సంక్షేమాన్ని కాపాడాలని వినతి

డెయిరీలో మిగతా 2లో..

11న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు


▶ వార్త 2లో..

నేటి నుంచి యూనివర్శిటీ కల్చరల్ ఫెస్ట్

▶ వార్త 2లో..

రేషన్ కందిపప్పు కొందరికేనా ?

▶ వార్త 7లో..



పోర్టులో బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

483 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యం సీజ్

విశాఖ పోర్టులో మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీలు

వార్త మెయిన్‌లో..

ఎల్‌ఐసిని నిర్వీర్యం చేస్తే ఊరుకోం

ఏజెంట్స్ ఆర్గనైజేషన్ మహాధర్నాలో మంజునాథ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎల్‌ఐసిలో ఐఆర్ డిఎఐ ద్వారా ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి ప్రవేశపెట్టిన ప్రతిపాదనలను తక్షణమే ఉపసంహరించుకోవాలంటూ సోమవారం ఎల్‌ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన విశాఖపట్నం ఎల్‌ఐసి డివిజన్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించారు. సంఘం డివిజన్ అధ్యక్షులు ఎం.నాగరాజు అధ్యక్షతన అక్కడే సభ జరిపారు. ముఖ్య వక్తగా హాజరైన సంఘం ఆలిండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీమా రంగంలో తీసుకొస్తున్న విధానాలను వివరించారు. ఆ విధానాల వల్ల 14 లక్షల మంది ఏజెంట్ల భవిష్యత్తు, ఎల్‌ఐసి సంస్థ నిర్వీర్యమవుతాయన్నారు. సంస్థను కార్పొరేట్లకు అప్పజెప్పే కుట్రలు సాగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా నవంబర్ 10 నుంచి డిసెంబర్ 10 వరకు అన్ని డివిజన్ల ప్రధాన కార్యాలయాల



మహాధర్నాలో మాట్లాడుతున్న మంజునాథ్

వద్ద ధర్నాలు జరుగుతున్నాయన్నారు. ఎల్‌ఐసి ఏజెంట్స్ నుంచి కమీషన్‌ను రికవరీ చేసే క్లాబ్యాక్ నిబంధనను తొలగించాలన్నారు. తగ్గించిన ఏజెంట్ల కమీషన్‌ను పెంచాలన్నారు. కనిష్ట బీమా మొత్తం రూ.లక్షగా ఉండాలని, ఇన్సూరెన్స్ తీసుకునే వయస్సును 59 సంవత్సరాల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ ప్రీమియంపై జిఎస్‌టిని రద్దు చేయాలని, పెంచిన ప్రీమియం తగ్గించాలని,

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఎల్ఐసిని నిర్వీర్యం చేస్తే ఊరుకోం

పాలసీ హోల్డర్స్ బోనస్ పెంచాలని, అందరి ఏజెంట్స్‌కు మెడికల్ క్లెయిమ్ సౌకర్యం కల్పించాలని, గ్రాట్యుటీ సీలింగ్ ఎత్తివేయాలని కోరారు. అందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. గ్రూప్ ఇన్సూరెన్స్ ఏజెంట్ బతికి ఉన్నంతకాలం అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి 2025 ఫిబ్రవరి 11న లక్షలాది మందితో చలో పార్లమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. మహాధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి కిషోర్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నాగరాజు, ఎన్.రవీంద్రనాథ్, ఠాగూర్, యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కె.త్రిమూర్తులు, కె.ఆంజనేయులు, అబ్దుల్ సత్తార్, ఎం.శ్రీరాములు, ధనుంజయ్, పి.శ్రీనివాసరావు, డిఎవి.నారాయణరావు, జి.రామారావు, ఎన్.రమణబాబు, ఎంసిహెచ్.ఈశ్వరరావు, వి.కావ్య, కె.మాధవి, పెద్ద సంఖ్యలో ఎల్ఐసి ఏజెంట్స్ పాల్గొన్నారు.

11న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ అధ్యక్షతన బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆమె ఛాంబర్ సమీపంలోని విసి హాలులో, జెడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకుగల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయని, సంబంధిత ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 3, 4వ స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు 12 గంటలకు జరుగుతాయని వివరించారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపిపిలు, అధికారులు సమావేశాలకు హాజరు కావాలని కోరారు.



ఫెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నేటి నుంచి యూనివర్సిటీ కల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎస్ఎఫ్ఐ ఆంధ్రా యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండు రోజులు పాటు యూనివర్సిటీ కల్చరల్ ఫెస్ట్ జరుగనుందని, దీన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం యూనివర్సిటీ కమిటీ అధ్యక్షులు ఆర్.హర్షిత్, కార్యదర్శి డి.వెంకటరమణ కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం యూనివర్సిటీలోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో ఫ్లాష్ మాబ్ నిర్వహించామన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఫెస్ట్‌లో పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం : పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామని ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1397వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు కార్మికుల సుదీర్ఘ పోరాటాన్ని కేంద్రంలోని మోడీ సర్కారు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను పట్టించుకోవడం మానేశాయన్నారు.

రెండు రోజుల్లో సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలోని సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు, అన్ని రకాల వ్యాపార సంస్థల వివరాల సేకరణ సర్వేను రెండు రోజుల్లో పూర్తిచేసి నివేదించాలని ఎంపిడిఒ ఎవివి.కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్‌లో సచివాలయ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఆయా సర్వేలో మండలం వెనుకబాటులో ఉందన్నారు. ప్రభుత్వం, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కుటీర పరిశ్రమలు, వ్యాపార సంస్థల వివరాలను సేకరించి నివేదించాల్సి ఉన్నందున త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా సంస్థలకు ప్రభుత్వపరంగా రుణతోడ్పాటుకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు. సర్వేలో భాగంగా ఎన్‌పిసిఐ, మొబైల్ నెంబర్, బ్యాంకు అకౌంట్, ఆధార్ నెంబర్లలో అనుసంధాన ప్రక్రియను పూర్తయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

విశాఖ డెయిరీలో సభా సంఘం పర్యటన



సభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు గంగారావు, కుమార్

(మొదటి పేజీ తరువాయి..)

జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించి పాల రైతుల సంక్షేమాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం ఆధ్వర్యాన జ్యోతుల నెహ్రూకు విశాఖ కలెక్టరేట్ వద్ద నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం నెల రోజుల క్రితం రైతులతోగానీ, పాల రైతుల సంఘం సభ్యులతోగానీ చర్చించకుండానే ఏకపక్షంగా ఆవు పాల ధరను తగ్గించేసిందన్నారు. దీనిపై రైతాంగం పెద్ద ఎత్తున గ్రామాల్లో నిరసనలు వ్యక్తం చేశారని తెలిపారు. డెయిరీ కార్యాలయం వద్ద అక్టోబర్ 29, డిసెంబర్ 2 తేదీల్లో రైతులు మహా ధర్నాలు చేపట్టారని గుర్తుచేశారు. ఈ క్రమంలో డెయిరీ అధికారులు దిగివచ్చి తగ్గించిన పాల ధరను పునరుద్ధరిస్తామని చెప్పినా ఆ దిశగా నేటికీ చర్యలు తీసుకోలేదన్నారు. డెయిరీలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న చర్యలను వివరించారు. సహకార రంగంలో ప్రారంభించిన డెయిరీని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా 37 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని రాంబాబు తదితరులు సభా సంఘానికి అందజేశారు. కార్యక్రమంలో పాల రైతుల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కోశాధికారి జి.నాయనిబాబు, విజయనగరం జిల్లా అధ్యక్షులు లోకవరపు ఆదినారాయణమూర్తి, కార్యదర్శి గొంప కృష్ణమూర్తి, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు రెడ్డి రమణమూర్తి, శ్రీకాకుళం జిల్లా నాయకులు యనమల రమణ, విజయనగరం జిల్లా నాయకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు

డెయిరీ అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టిండి : సిపిఎం

విశాఖ డెయిరీ అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపి, పాడి రైతుల ఆస్తులను కాపాడాలని, తగ్గించిన పాల సేకరణ ధరను వెంటనే పునరుద్ధరించాలని, కంపెనీ యాక్టు నుంచి సొసైటీ యాక్టులోకి విశాఖ డెయిరీని తీసుకురావాలని కోరుతూ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ సభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూకు, కమిటీ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. పాడి రైతుల ఆస్తులను పరిరక్షించి, ప్రోత్సహించాల్సిన విశాఖ డెయిరీ పాలకవర్గం తమ సొంత ఆస్తులను కూడబెట్టుకోవడానికి అనేక తప్పుడు మార్గాలను ఎంచుకొని వివిధ రూపాల్లో అవినీతికి పాల్పడుతోందన్నారు. పాల ఉత్పత్తిదారులకు చెందిన ఆస్తులను కొద్ది మంది వ్యక్తులు తమ సొంతం చేసుకుంటున్నారని తెలిపారు. 2016లో రూ.1100 కోట్ల ఉన్న టర్నోవర్ 2020కి సుమారు రూ.2 వేల కోట్లు దాటిందన్నారు. ఇప్పుడు నష్టాలు, అప్పుల బాటలోకి డెయిరీ వెళ్లిందన్నారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. వాటిని సోదాహరణంగా కమిటీకి వివరించారు.

డెయిరీ కాలుష్యం నుంచి కాపాడాలి

గాజువాక : విశాఖ డెయిరీ నుంచి విడుదలవుతున్న జల, వాయు కాలుష్యం నుంచి ప్రజలను కాపాడాలని కోరుతూ శాసనసభా కమిటీ ఛైర్మన్ జ్యోతుల నెహ్రూకు సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, ఎ.లోకేష్ సోమవారం వినతిపత్రం అందజేశారు. విశాఖ డెయిరీ వాయు కాలుష్యం వల్ల అక్కిరెడ్డిపాలెం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆరు లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్నారని, వాటిని ప్రాసెస్ చేయడానికి 75 డిగ్రీల వద్ద మరిగిస్తున్నారని తెలిపారు. దీనికోసం బొగ్గు, ఆయిల్ బాయిలర్లను, భారీ మొత్తంలో కాస్టిక్ సోడా, సెల్ఫిక్ యాసిడ్ రకరకాల కెమికల్స్‌ను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. వాడిన తర్వాత వచ్చే కెమికల్స్‌ను కాలవల ద్వారా విడిచిపెడుతున్నారని వివరించారు. దీంతో భరించలేని దుర్వాసన వస్తోందని తెలిపారు. భూగర్భ జలాలు కలుషితం కావడంతో కిడ్నీ, కేన్సర్, శ్వాస కోస వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆక్రమణ భూమిని స్వాధీనం చేసుకోవాలి

విశాఖ డెయిరీ యాజమాన్యం ఆక్రమించిన మూడు ఎకరాల బంజరు భూమిని స్వాధీనం చేసుకోవాలని శాసనసభ కమిటీ సభ్యులు పల్లా శ్రీనివాసరావుకు సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు ఎ.లోకేష్, ఎం.సుబ్బన్న సోమవారం వినతి పత్రం అందజేశారు. సర్వే నెంబర్ 47/3లో మూడెకరాల బంజరు భూమిని విశాఖ డెయిరీ యాజమాన్యం ఆక్రమించుకొని ప్రహరీ నిర్మించిందని తెలిపారు.చుట్టుపక్కల ప్రజలందరికీ ఇది సంత స్థలం అనిపేర్కొన్నారు. దీన్ని స్వాధీనం చేసుకుని ఆట స్థలం నిర్మించాలని కోరారు.



రంగారావుకు వినతిపత్రం అందజేస్తున్న పాల రైతుల సంఘం నాయకులు

ముడసర్లోవలో ఇసుక నిల్వ కేంద్రం



ముడసర్లోవ కొత్తరోడ్డులో ఏర్పాటుచేసిన కేంద్రంలో నిల్వ ఉన్న ఇసుక

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ కొత్త రోడ్డులో ఇసుక నిల్వ కేంద్రం సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. విశాఖలో ఇసుక రీచ్ కేంద్రాలు లేనందున ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా స్థాయి ఇసుక కమిటీ ద్వారా ప్రైవేట్ ఏజెన్సీలు ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ ప్రకటించిన విషయం విధితమే. దీనిలో భాగంగా ముడసర్లోవ కొత్త రోడ్డులో డంపింగ్ యార్డు సమీపంలోని సోలార్ విద్యుత్ ప్లాంట్ ఎదురుగా ఖాళీ స్థలంలో నన్నపనేని ఎర్త్ వెూర్స్ ప్రయివేటు ఎజెన్సీకి ఈ కేంద్రాన్ని అప్పగించారు. ప్రస్తుతం ఇసుక కేంద్రంలో శ్రీకాకుళం ఇసుక రీచ్‌ల నుంచి తీసుకొచ్చిన సుమారు 75 టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్టు నిర్వాహకులు తెలిపారు. టన్ను ఇసుక ధర రూ.700గా నిర్ణయించారు. అవసరమైన వారు ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయించుకొని ఇక్కడ ఇసుకను పొందవచ్చని పేర్కొన్నారు. లేకుంటే ఇసుక కేంద్రం వద్దకే తమ ఆధార్ కార్డు తీసుకు వచ్చి రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ 8309186417, 6300805838 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పరదేశిపాలెం - గంభీరం రోడ్డుపై ఫిర్యాదు

ప్రజాశక్తి -ఆనందపురం : బడాబాబుల లబ్ధి కోసం పరదేశిపాలెం నుంచి గంభీరం పంచాయతీకి రోడ్డు ఏర్పాటుచేయడం తగదని గంభీరం సర్పంచ్ వానపల్లి లక్ష్మి, నాయకులు ముత్యాలరావు, గ్రామస్తులు సోమవారం విఎంఆర్‌డిఎ వైస్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. పరదేశిపాలెం నుంచి గంభీరానికి రోడ్డు ఏర్పాటుకు 2023లో పంచాయతీకి తెలియజేయకుండా కొంతమంది బడాబాబులు లబ్ధికోసం 60 అడుగుల రోడ్డు వేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రైతుల జిరాయితీ భూములు, కొండ భూములను స్వాధీనపరచుకొని అక్రమంగా రోడ్డు వేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిని నిలుపుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



కిశోర్ వికాసంపై ప్రతిజ్ఞ చేస్తున్న ప్రతినిధులు

కిశోర్ వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం కిశోర్ వికాసంపై మండల స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కిశోర్ బాలికల విద్య ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాలు తదితర విషయాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ జైదేవి, పిఒ శ్రీదేవి, ఎంపిడిఒ జానకి, కాలేషా బేగం, ఎంఇఒ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



సైకిళ్లు అందిస్తున్న సుభాష్ చంద్రబోస్

ఇద్దరు బాలికలకు సైకిళ్లు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు పేద విద్యార్థినులకు సోమవారం శ్రీ మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ సైకిళ్లను పంపిణీ చేశారు. గొట్టిపల్లి హైస్కూల్లో చదువుతున్న చీమలమెట్టపాలేనికి చెందిన జాన వరలక్ష్మి (9వ తరగతి), కుసులువాడ గ్రామానికి చెందిన పిళ్లా వర్ష (7వ తరగతి) ఆయా గ్రామాల నుంచి నిత్యం పాఠశాలకు నడిచి వస్తుండటంతో స్థానిక నాయకులు బోసుబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన ఇద్దరు విద్యార్థినులకు సైకిళ్లను కొనుగోలు చేసి పంపిణీ చేశారు. తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న బోసుబాబును స్థానిక నాయకులు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బంటు అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాడ నాయుడుబాబు, పాఠశాల కమిటీ చైర్మన్ వెన్ని నారాయణరావు, గిడిజాల మాజీ సర్పంచ్ కోరాడ రాము, కూటమి నాయకులు కోరాడ వైకుంఠ, కోరాడ తమ్మునాయుడు, సుంకర శివ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

ప్రజాశక్తి- భీమునిపట్నం : తగరపువలసలో ఇప్పటికే నిర్మించి ఉన్న రైతు బజార్‌ను త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ సిపిఐ స్థానిక నాయకులు కానూరు రాంబాబు, ఎం.అప్పలరాజు తదితరులు సోమవారం స్థానిక ఎఎంసి కార్యాలయంలో కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. రైతు బజారులో మౌలిక సదుపాయాలు కల్పించి సాధ్యమైనంత త్వరగా వినియోగంలోకి తీసుకు రావాలని కోరారు.

11న గీతంలో 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్'

ప్రజాశక్తి-మధురవాడ : దేశంలోని యువతలో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్'కు ఆంధ్రప్రదేశ్‌లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇవ్వనున్నది. గీతంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలలో గల మరో 50 విద్యాలయాలలో, ఐఐటిలలో జరిగే ఈ స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్‌ను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వర్చ్యువల్‌గా ప్రారంభించనున్నారు. గీతంలో జరిగే స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్‌లో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి 29 విద్యార్థి బృందాలు పాల్గొనున్నాయని పోటీలకు విశాఖ పర్యవేక్షకునిగా వ్యవహరిస్తున్న బి.రాజ్‌కుమార్ తెలిపారు. స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్‌లో 17 అంశాలపై విద్యార్థుల నుంచి నూతన పరిష్కారాలను, ఆలోచనలను ఆహ్వానించగా గీతం పోటీలలో పాల్గొనే జట్లు బ్లాక్‌చైన్, సైబర్ సెక్యూరిటీ, విపత్తుల నిర్వహణ, స్మార్ట్ ఎడ్యుకేషన్, రెన్యువబుల్ ఇంజినీరింగ్ అంశాలపై తమ ఆలోచనలను ప్రతిపాదించడానికి ముందుకు వచ్చాయని పేర్కొన్నారు. న్యాయ నిర్ణేతల సమక్షంలో స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్ జట్ల ఆలోచనలను పరిశీలించి విజేతలను ప్రకటిస్తామన్నారు. గీతం పోటీలలో పాల్గొనే జట్లలో తమళనాడు నుంచి పూర్తిగా మహిళల జట్టు పాల్గొనడం విశేషం అని తెలిపారు. గీతం జట్టు తమిళనాడులోని ఎరోడ్‌లోగల ఎక్సెల్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే పోటీలకు హాజరవుతోందని వెల్లడించారు.

స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్ విశిష్టత

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ గత ఆరు సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులకు ముందుగా కేంద్ర ప్రభుత్వ, ఇతర శాఖలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం కనుగొనాల్సిందిగా సూచిస్తారు. ఉత్తమ పరిష్కారం తెలిపే జట్లను గుర్తించి ప్రోత్సహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది స్మార్ట్‌ఇండియా హ్యాకథాన్-24 పోటీలలో పాల్గొనే జట్లకు 54 ప్రభుత్వ శాఖలు, విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు ఎదుర్కొంటున్న 250 సమస్యలను పరిష్కారం తెలపాల్సిందిగా సూచించారు. వివిధ రాష్ట్రాలలో నిర్వహించిన పోటీలలో 86వేల జట్లు పాల్గొనగా వాటిలో 49 వేల విద్యార్థి జట్లను జాతీయ స్థాయిలో ఈ నెల 11వ తేదీన జరిగే పోటీలకు ఎంపిక చేశారు. ఈ విధంగా గీతంలో జరిగే పోటీలకు 174 మంది విద్యార్థులు 14 రాష్ట్రాల నుంచి తరలి రానున్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బిఎస్ఎన్ఎల్ సహకారంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగంలో 'ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, నెక్ట్స్ జనరేషన్ కమ్యూనికేషన్ నెట్ వర్క్' అంశంపై ఇటీవల ప్రారంభమైన ప్రోగ్రాం సోమవారంతో ముగిసింది. బిఎస్ఎన్ఎల్ ఎజిఎం బిఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ, వైర్‌లెస్ కమ్యూనికేషన్‌లో 2జి నుంచి 5జి వరకు వచ్చిన మార్పులను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ మాట్లాడుతూ, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌పై రియల్ టైమ్ ప్రాజెక్టులను రూపొందించాలని అధ్యాపకులకు సూచించారు. కళాశాల డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ, అధ్యాపకుల సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా మెరుగు పరచడానికి తమ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ వి.శివభాస్కరరావు, 76 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.



అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బిఎస్ఎన్ఎల్ ఎజిఎం శ్రీనివాసరావు

పాఠశాలకు నీటి శుద్ధీకరణ యంత్రం



ప్రజాశక్తి -తగరపువలస

చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన రూ.1.25 లక్షల విలువైన తాగు నీటి శుద్ధీకరణ యంత్రాన్ని తూడెం ఎంపిపి పాఠశాలకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, డైట్ అధ్యాపకులు కె.సూర్యారావు, ఎ.శ్రీనివాస్, అసిస్టెంట్ జిసిడిఒ గాయత్రి, హెచ్‌ఎం కమల, సిఎస్ఆర్ ప్రతినిధులు శ్రీనివాస్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

వార్షికోత్సవ సభలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : పేద విద్యార్థులకు, వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు పలు రూపాల్లో కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కొనియాడారు. స్థానిక ఫౌండేషన్ కార్యాలయంలో సంస్థ వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రస్తుతం అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని, ఇందుకు తన వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం తాళ్లవలస అనాధా శ్రమం, బోరవానిపాలెం అంధుల ఆశ్రమంలో ఉన్న వారికి నిత్యావసరాలు, వస్త్రాలను ఎమ్మెల్యే గంటా ద్వారా అందజేశారు. మహిళలకు కుట్టు మిషన్లు, వికలాంగులకు ట్రై సైకిళ్లు, కంప్యూటర్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వీటా మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎమ్‌డి విజయభాస్కర్, ఆర్ఆర్ ఇంజినీరింగ్ కంపెనీ ఎమ్‌డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



అనాధ పిల్లలకు నిత్యావసర వస్తువులు, వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

రైతుల కష్టంతో విశాఖ డెయిరీ ఏర్పాటు

శాసనసభా సంఘం చైర్మన్ జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి -గాజువాక : రైతులు, ఉద్యోగుల కష్టం ఫలితంగా విశాఖ డెయిరీ ఏర్పాటైందని శాసనసభా సంఘం చైర్మన్ జ్యోతుల నెహ్రూ అన్నారు. విశాఖ కో-ఆపరేటివ్ డైరీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖ డెయిరీ ఎదుట కార్మికులు చేస్తున్న దీక్షలను సోమవారం శాసనసభా సంఘం ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలుగు జిల్లాలకు సంబంధించి విశాఖ డెయిరీలో 3 లక్షల మంది రైతులు ఉన్నారని తెలిపారు. డెయిరీలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, దానిపై విచారణకు వచ్చామని చెప్పారు. యాజమాన్యం చెప్పిన విషయాలను చూస్తే మరిన్ని అనుమానాలు రేకెత్తిస్తున్నాయని తెలిపారు. డెయిరీలో జరుగుతున్న విషయాలన్నింటిపైనా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు అనుకూలంగా నివేదిక ఉంటుందన్నారు. విశాఖ డెయిరీని కాపాడటమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. కాంట్రాక్టు కార్మికులు చెల్లిస్తున్న జీతాల్లో సగం దళారులు నొక్కేస్తున్నారని తెలిపారు.

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, విశాఖ డెయిరీకి ఆనుకొని ఉన్న గ్రామాల్లో కాలుష్యం లేకుండా చూడాలని కోరారు. విశాఖ డెయిరీలో లోపాలపై మరింత చర్చ జరగాల్సి ఉందన్నారు. వీటన్నింటిపై మరోసారి పరిశీలనకు వస్తామని తెలిపారు. ఉద్యోగుల ఉద్యమానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకుల ఎస్.రమణ, సిఐటియు నాయకులు రాంబాబు, ఎ.లోకేష్, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో యాజమాన్య ప్రతినిధులు

'ఆదర్శ్'లో అట్టహాసంగా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పెందుర్తి: ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో జెన్ జీల్-2024 కార్యక్రమం పేరిట సోమవారం వాలీబాల్, డ్రాయింగ్, పాటల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో 120 మంది ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ తెలిపారు. పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు చెప్పారు.

విజేతలు

ఈ పోటీల్లో పలువురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. క్లాసికల్ పాటల పోటీలో ప్రథమ బహుమతి సోఫియా కళాశాలకు, ద్వితీయ బహుమతి ఆనంద్ సాయి కళాశాలకు, ఫోక్ సింగింగ్‌లో ప్రథమ బహుమతి అంబేద్కర్ జూనియర్ కళాశాలకు, ద్వితీయ బహుమతి సోఫియా జూనియర్ కళాశాలకు, ప్రెజిడెటిక్‌లో ప్రథమ బహుమతి సోఫియా కళాశాల, ద్వితీయ బహుమతి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీకి, వాలీబాల్‌లో కొత్తవలస గవర్నమెంట్ జూనియర్ కాలేజీ విన్నర్‌గా, పెందుర్తిలోని ఆనంద్ సాయి కళాశాల రన్నర్‌గా నిలిచాయని కరస్పాండెంట్ ప్రకటించారు.

డ్రాయింగ్‌లో ప్రథమ బహుమతి సోఫియా జూనియర్ కళాశాలకు, ద్వితీయ బహుమతి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాలకు, తృతీయ బహుమతి ఆనంద్ సాయి కాలేజీ, పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీకి వచ్చినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

10వ తేదీన జరిగే చెస్, క్యారమ్స్, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ పోటీలకు స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవచ్చని, ఎంట్రీ ఫ్రీ అని కరస్పాండెంట్ తెలిపారు.

హామీలు అమలుచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారాలు వేసే జీవో 21 31 రద్దు చేస్తామని డ్రైవర్లకు పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు అమలుచేస్తామని చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ ద్వారకానగర్ జంక్షన్‌లో ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ, అధికారంలోకి రాకముందు హామీలిచ్చి బాధ్యతలు చేపట్టి ఆరు నెలలు గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. ఆటో డ్రైవర్లను నిలువు దోపిడీ చేసే ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు, శ్రీరామ చిట్స్ అండ్ ఫైనాన్స్ అధిక వడ్డీ వేధింపులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్ల పిల్లలకు విద్య, వైద్యంలో 50 శాతం రాయితీ కల్పించాలని విజ్ఞప్తిచేశారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ధర్నాలో రవికృష్ణ స్టాండ్ అధ్యక్షులు యు.శివాజీ, కె.దేముడు, ఈశ్వరరావు, వై.సతీష్, ఎం.భాస్కర్, ఎస్.అప్పలరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపనచేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డులో రూ.40 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డులో మౌలిక సదుపాయాలతో పాటు గ్రీన్ బెల్ట్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ 3 కమిషనర్ శివప్రసాద్, శ్యామల దీపిక, పరశురామరాజు, ధర్మారావు, డిఎఇ వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సిపిఎం మహాసభల జయప్రదానికి ప్రచారం


కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తిలో ఈ 28, 29 తేదీలో జరగబోయే సిపిఎం మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ 94వ వార్డు పరిధి వేపగుంట బిసి.కాలనీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బి.రమణి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. మరొకపక్క విద్యుత్ భారాలను భారీగా వేశారని తెలిపారు. వీటిపై ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పేద ప్రజల కోసం సిపిఎం పోరాటాలు చేస్తోందని, సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎయును సందర్శించిన ఆస్ట్రేలియా వర్సిటీ విద్యార్థులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఆస్ట్రేలియా మెల్‌బోర్న్ నగరంలో ఉన్న విక్టోరియా యూనివర్సిటీ విద్యార్థులు సోమవారం సందర్శించారు. ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావును మర్యాదపూర్వకంగా కలిశారు. విక్టోరియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మార్సెల్లె కాసియో టోలో, రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ విభాగం డైరెక్టర్ డాక్టర్ గ్రెగ్ అరోన్సెన్, అన్నే మేరీల నేతృత్వంలోని విద్యార్థుల బృందం వీసీని కలిసి రెండు విశ్వవిద్యాలయాల మధ్య పరస్పర సహకారం దిశగా చర్చించారు. కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు, కేథరిన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ ఇవాంజెలిన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విక్టోరియా యూనివర్సిటీ ప్రతినిధులను ఎయు అధికారులు సత్కరించారు. ఆస్ట్రేలియా యూనివర్సిటీ- ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంతో సంయుక్తంగా సదస్సుల నిర్వహణ, కార్యక్రమాలను నిర్వహించాలని ప్రతిపాదించారు. ఈ దిశగా కలిసి పని చేయాలని నిర్ణయించారు. అనంతరం విద్యా విభాగాన్ని ఆస్ట్రేలియా విద్యార్థుల బృందం సందర్శించారు.


ఎయులో ఆస్ట్రేలియా విద్యార్థులు

ఘనంగా సన్‌రైజ్ చిల్డ్రన్ హాస్పిటల్ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న సన్‌రైజ్ చిల్డ్రన్ హాస్పిటల్ ఎండి తిరుపతిరావు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలోని సన్‌రైజ్ చిల్డ్రన్ హాస్పిటల్ 10వ వార్షికోత్సవాన్ని సోమవారం ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎండి డాక్టర్ తిరుపతిరావు మాట్లాడుతూ, 2015 డిసెంబర్ 9వ తేదీన గాజువాకలో ఆసుపత్రిని ప్రారంభించామని తెలిపారు. కేవలం చిన్నపిల్లలకు అత్యుత్తమ హాస్పిటల్ నిర్మించడమే లక్ష్యంగా ఏర్పాటుచేసినట్లు చెప్పారు. గాజువాకలో సరైన వైద్య విధానాలు లేకపోవడంతో నాణ్యతతో వైద్యం అందించేందుకు ఆసుపత్రిని ప్రారంభించినట్లు తెలిపారు. ఆసుపత్రి ప్రారంభించిన సమయంలో పుట్టిన పిల్లలు వైద్య విభాగం, చిన్న పిల్లల వైద్య విభాగంతోపాటు, అవుట్ పేషెంట్ విభాగాలను ప్రారంభించిన ఏకైక చిన్నపిల్లల ఆసుపత్రి అని పేర్కొన్నారు. పదేళ్ల కాలంలో అనేక ప్రాణాంతక, విష వ్యాధులను నిష్ణాతులైన వైద్య బృందంతో నియంత్రించి అనేకమంది పిల్లల ప్రాణాలు కాపాడామని తెలిపారు. ప్రపంచంలో అత్యాధునిక ప్రమాణాలతో కూడిన మిషనరీ ఉందని వివరించారు. 24 గంటలూ రక్త పరీక్షలు, మందుల దుకాణం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రక్త పరీక్షల్లో ఎన్ఎబిహెచ్ ప్రమాణాలు పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్రాండెడ్ కంపెనీల మందులను మాత్రమే విక్రయిస్తున్నట్లు తెలిపారు. 2017 సంవత్సరం నుంచి అనేక కుటుంబాలకు ఆర్థిక సహాయం, ఉచిత వైద్యం అందించినట్లు వివరించారు. ఎన్ఐసియు సేవలు నో పేషెంట్‌కు రెండు నెలలు ఉచితంగా వెంటిలేటర్ వైద్యం అందించినట్లు తెలిపారు. నవంబర్ నెలలో వెంకటలక్ష్మికి ఉచితంగా ఐసియు, వెంటిలేటర్ వైద్యం అందించినట్లు చెప్పారు.


వైద్య సేవలందిస్తున్న ఎండి తిరుపతిరావు

పిజిఆర్ఎస్‌కు వినతులు

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : జివిఎంసి జోన్-5 కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు వినతులు వచ్చినట్లు జోనల్ కమిషనర్ బి.రాము తెలిపారు. ఈ మూడూ టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ తారా ప్రసన్న, ఎఎంఒహెచ్ డాక్టర్ సునీల్‌కుమార్, ఎసిపి శాస్త్రి, ఆర్ఒ రాజ్యలక్ష్మి, ఎపిడి పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి జోన్ -3 కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు వచ్చినట్లు జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు.

వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధి వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎనిమిది వినతులు వచ్చినట్లు జోనల్ కమిషనర్ హేమలత తెలిపారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి నాలుగు, ఎఐడబ్ల్యూఎస్ ఒకటి, పబ్లిక్ హెల్త్-2, ఇఇకి 1 వినతులు వచ్చాయని, వాటిని సంబంధిత అధికారులకు పంపించినట్లు పేర్కొన్నారు.

గౌరీ శంకర్ మృతిపై సమగ్ర దర్యాప్తు అవసరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ సెంట్రల్ జైల్లో జులై 30న చోటుచేసుకున్న దళిత యువకుడు ఉప్పాడ గౌరీ శంకర్ మరణంపై మెజిస్ట్రీరియల్ విచారణ జరపాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనందపురం మండలం పేకేటి గ్రామానికి చెందిన ఉప్పాడ గౌరీ శంకర్ ఈ ఏడాది జులై 30న విశాఖ కేంద్ర కారాగారంలో మృతి చెందాడన్నారు. ఆయన మరుగు దొడ్డిలో ఉరి వేసుకున్నట్టు జైలు అధికారులు ప్రకటించి చేతులు దులుపేసుకున్నారని తెలిపారు. ఆయన మరణంపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. పోలీసాధికారులు వారి గోడును పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో మృతుడి తల్లి ఉప్పాడ నరసయ్యమ్మ, సోడదాసి సుధాకర్, జాజి ఓంకార్, ఉప్పాడ రాము, రవి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

జీల్ పురాణం కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం : డాక్టర్ దేవా హెచ్ పురాణం, సీనియర్ ఎగ్జిక్యూటివ్, భాగస్వామి-మేనేజింగ్ డైరెక్టర్, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ కన్సల్టింగ్ ఫర్మ్, పి అండ్ ఎ, యూఎస్ఏ, యూకే అందించిన సహకారంతో ఏయూ ఫార్మసీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జీల్ పురాణం ఇన్‌స్ట్రుమెంటేషన్ ల్యాబ్‌ను ఆంధ్రా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈ.ఎన్.ధనంజయరావు ప్రారంభించారు.

బోధనేతర పనులు తగ్గించకుండా స్కూళ్లకు రేటింగా?

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి
- మండలంలో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉపాధ్యాయులకు ఊపిరి సలపనివ్వని బోధనేతర పనులను ప్రభుత్వమే అప్పగిస్తూ, బోధనకు తగు సమయాన్ని ఇవ్వకుండా, పాఠశాలలకు రేటింగ్ ఇచ్చి అవి వెనుకబడ్డాయని చెప్పడం విడ్డూరంగా ఉందని ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయ గౌరి సోమవారం అనకాపల్లి మండలంలో పర్యటించి ఉపాధ్యాయులను కలిసి తన అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీకి నేటికీ నోటిఫికేషన్ ఇవ్వకుండా పోస్టులు భర్తీ విషయంలో మీనమేషాలు లెక్కబెడుతున్న ప్రభుత్వం, అకడమిక్ స్టాండర్డ్స్ తగ్గాయని చెప్పడం దుర్మార్గమన్నారు. పాఠశాలలకు మౌలిక వసతులు పూర్తిగా కల్పించకుండా రేటింగ్ ఇవ్వడం సరికాదన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చాలా పాఠశాలలకు పక్కా భవనాలు, మరుగుదొడ్లు లేవని, ఏకోపాధ్యాయ పాఠశాలల నడుస్తున్నాయని, ఇలాంటి తరుణంలో అకాడమిక్ స్టాండర్డ్స్ పెరగలేదని చెబుతూ ప్రభుత్వ పాఠశాలల గౌరవాన్ని దిగజార్చడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో పోస్టులు భర్తీ చేసి మౌలిక వసతులను కల్పించి, స్కూల్ అభివృద్ధి నిధులను విడుదల చేసి కోరారు. 2025 మార్చి నెలలో జరగబోవు ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ నిరంతరం పాఠశాలల పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్న, 30 సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తిలో అనుభవం కలిగిన కోరెడ్ల విజయ గౌనిని ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అనకాపల్లి మండలంలో పర్యటనలో భాగంగా మామిడిపాలెం జడ్పీ హైస్కూల్లో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తన ప్రచారాన్ని మొదలుపెట్టారు. తదనంతరం తుమ్మపాల జడ్పీ హైస్కూల్, గవరపాలెం జీవీఎంసీ హైస్కూల్, గాంధీనగర్ జివిఎంసి హైస్కూల్, టౌన్ గర్ల్స్ హైస్కూల్, మునిసిపల్ పెద్ద హైస్కూల్ తదితర పాఠశాలలను సందర్శించి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు రొంగలి అక్కు నాయుడు, జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాజునాయుడు, అనకాపల్లి మండల అధ్యక్షులు మామిడి బాబురావు, ప్రధాన కార్యదర్శి నాతవరపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.


టౌన్ గర్ల్స్ హైస్కూల్లో ఉపాధ్యాయులతో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి


యశ్వంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సీతాలక్ష్మి తదితరులు

బాక్సింగ్‌లో యశ్వంత్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం బిఎస్సి కంప్యూటర్ సైన్స్ చదువుతున్న కండిపల్లి యశ్వంత్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించాడు. ఈ నెల 8న ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విశాఖ ప్రొఫెషనల్ బాక్సింగ్ లీగ్‌లో జరిగిన 54 కేజీల విభాగంలో పాల్గొన్న యశ్వంత్ ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం యశ్వంత్‌ను కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.శంకర్, ఎంవి రామకృష్ణ, కంప్యూటర్ అధ్యాపకులు గణేష్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ గణేష్ లెక్కల పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : విద్యార్థి దశ నుండి మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండి వాటికి జోలికి పోకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని బుచ్చయ్యపేట ఎస్సై ఏ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని తురకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మారకద్రవ్యాలపై సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలను ఉపయోగిస్తే భవిష్యత్తు ఏ విధంగా నాశనం అవుతుందో దృశ్య శ్రవణం ద్వారా వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నేడు మాజీ ఎమ్మెల్యే పైలా 20వ వర్ధంతి

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మాజీ శాసనసభ్యులు పైలా అప్పలనాయుడు 20వ వర్ధంతి మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు, వైసిపి సిఇసి సభ్యులు పైలా శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరవాడ సంతబయలు వద్ద గల పైలా అప్పలనాయుడు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.

మార్గశిర ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-యలమంచిలి : స్థానిక ధర్మవరం వీధి కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర ఉత్సవాల పోస్టర్‌ను సోమవారం టిడిపి కార్యాలయంలో స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొఠారు సాంబశివరావు, కొఠారు కొండబాబు, మాడుగుల సత్యనారాయణ, ప్రకాష్, కొఠారు నరేష్, కొఠారు శ్రీను, టివిఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులతో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సోమవారం స్థానిక ఎంపీడీవో ఆఫీసులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో పెండింగ్ సమస్యలపై రాత పూర్వకంగా తెలియజేస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. మండలంలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామానికి తాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ షణ్ముఖంకు సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పైల జగన్నాధరావు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కర్నూలు వెంకటరమణ, సర్పంచ్‌లు మోటూరు సన్యాసినాయుడు, సిరపురపు అప్పలనాయుడు, బొద్ధపు శ్రీనివాస్, చింతకాయల ముత్యాలు, బుగిడి రామ గోవిందరావు, నాగిరెడ్డి చిన్నారావు, అర్జిల్లి రవి, బండారు రాజశేఖర్, వర్రి పరదేశి నాయుడు, సాలాపు శివ, పైల దినేష్, పావని, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

భోగలింగేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక భోగలింగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమం దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, కార్యనిర్వహణాధికారి బి మురళీకృష్ణ పర్యవేక్షణలో ధర్మకర్తలు, భక్తులు సమక్షంలో చేపట్టారు. లక్షా 282 రూపాయల ఆదాయం వచ్చిందని చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. గత సంవత్సరం కార్తీకమాసం తరువాత హుండీ లెక్కింపులో రూ.65,242 రాగా, ఈ ఏడాది కార్తీకమాసంలో భక్తుల సంఖ్య పెరగడంతో ఆదాయం పెరిగిందని సత్యనారాయణ చెప్పారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు మద్దాల నారాయణరావు, పెంటకోట గణేష్, మల్ల సూరిబాబు, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ బి వసంత కుమార్, అర్చకులు పేరూరు సూర్యనారాయణ, పేరూరి చిన్ని స్వామి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లతో పేదలకు మేలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను పున:ప్రారంభించడం వల్ల పేదలకు మేలు జరుగుతుందని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర అన్నారు. జివిఎంసి 81వ డివిజన్ టిడిపి నాయకుడు కాండ్రేగుల చిన్న కుమారుడు జన్మదినం సందర్భంగా రైల్వే స్టేషన్, ఎన్టీఆర్ హాస్పిటల్, అన్న క్యాంటీన్ వద్ద ఉదయం , మధ్యాహ్నం, సాయంత్రం, వారి ఆర్థిక సహాయంతో పేదవాళ్లందరికీ ఉచితంగా టిఫిన్స్, భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ భోజనాలను మల్ల సురేంద్రతో పాటు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల నూకు నాయుడు, పిడి ప్రసాద్, కాయల ప్రసన్న, పెంటకోట వరప్రసాద్, కృష్ణ, కర్రి మహాలక్ష్మి నాయుడు, చదరం శివ అప్పారావు పాల్గొన్నారు.

అల్పపీడనంతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఈ నెల 10, 11, 12 తేదీల్లో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని ప్రకటన వెలువడటంతో అన్నదాతలు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే పొలాల్లో కోసిన వరి పనలు పూర్తిగా ఆరకముందే కుప్పలు పెడుతున్నారు. ఏ సమయంలో ఎటువంటి చిరుజల్లులు వచ్చిన ఏడాది పడిన కష్టమంతా వృధా అయిపోతుందని కంగారుపడతున్నారు. కొందరు రైతులు పొలాల్లోనే చిన్న చిన్న కుప్పలుగా వేస్తున్నారు. ప్రస్తుతం తుఫాను గండం ఉన్న దృష్ట్యా వరి పంట కోతలను వాయిదా వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పొలాల్లో వేసిన కుప్పలు తడవకుండా టార్పాలిన్ వేసుకోవాలని, తడిసినా మొలక రాకుండా లేదా రంగు మారకుండా ఉండాలంటే 50 గ్రాముల కళ్ళు ఉప్పు లీటర్ నీటికి కలిపి వరి పనలు తడిచే విధంగా పిచికారీ చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట గ్రామపంచాయతీలో సోమవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. 60 లేగ దూడలను ప్రదర్శించగా పశుగణాభివృద్ధి శాఖ ఈవో బి ప్రసాద్‌రావు పాల్గొని మేలు జాతి దూడలను మూడింటిని ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు మంజుష రాణి, జి ప్రియాంక, ఈ దినేష్ కుమార్, రైతు సేవ కేంద్రం సిబ్బంది సురేష్, అప్పారావు, త్రినాధ్, రవీంద్ర, శ్రీను, మంగ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు తగ్గించాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజలపై భారాలుగా ఉన్న విద్యుత్ ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వార్వా- నివాస్ అనకాపల్లి జోన్-7 ఆధ్వర్యంలో ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్వా-నివాస్ కన్వీనర్లు బి.ఉమామహేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు, కాళ్ల తేలయ్య బాబు మాట్లాడుతూ సుమారు రూ.15 వేల కోట్లు అదనపు భారం ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపారన్నారు. స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై అదనపు భారాలను మోపుతున్నారని, వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విద్యుత్ ధరలు పెంచితే ఆందోళన చేసిన కూటమి పార్టీలు, తన వాగ్దానాలను పక్కనపెట్టి ఇప్పుడు ప్రజలపై అవే భారాలను కొనసాగించడం దారుణమన్నారు. అనంతరం కార్యాలయ నిర్వహణ అధికారికి వినతి పత్రం అందజేశారు. జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి పబ్లిక్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం ఇచ్చారు.

హైబీపీతో అంగన్వాడీ టీచర్ మృతి

సిఐటియు, ప్రజా సంఘాల నేతలు నివాళి


జయలక్ష్మి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఐసిడిఎస్ ఎలమంచిలి ప్రాజెక్టు పరిధి అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట అంగన్వాడీ టీచర్ భీమిశెట్టి జయలక్ష్మి (43) హైబీపీ వచ్చి సోమవారం మృతి చెందారు. అస్వస్థతకు గురైన జయలక్ష్మి ఆరోగ్య పరిస్థితి మెరుగుపరచడానికి కుటుంబ సభ్యులు సమీపంలోని వైద్యులను సంప్రదించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆమె మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి. జయలక్ష్మి అకాల మృతి పట్ల ప్రజాసంఘాల ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. తిమ్మరాజుపేటలోని జయలక్ష్మి పార్థివ దేహాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు రొంగలి రాము, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, యుటిఎఫ్ జిల్లా నాయకులు వెంకట అప్పారావు, కౌలు రైతు సంఘం నాయకులు సదాశివరావు, జెవివి నాయకులు రామకుమార్, సిఐటియు నాయకులు కూండ్రపు సోమనాయుడు, ఎస్.బ్రహ్మాజీ, సిపిఎం గ్రామశాఖ కార్యదర్శి ఎస్ రామనాయుడు, ఐద్వా మహిళా సంఘం నాయకులు ఆర్ లక్ష్మి, డిడి వరలక్ష్మి. అంగన్వాడీ యూనియన్ నాయకులు రామలక్ష్మి, తులసి, అంజలి జయలక్ష్మి, సెక్టార్ నాయకులు లక్ష్మీనారాయణమ్మ, వరలక్ష్మి, నారాయణమ్మ, పద్మ వీఆర్‌ఏల సంఘం శివలంక కృష్ణారావు, ఆశా యూనియన్ నాయకులు మంగమ్మ, పంచాయతీ పారిశుధ్య కార్మిక నాయకులు నాగేశ్వరరావులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జయలక్ష్మి అంగన్వాడీ యూనియన్ నాయకులుగా అనేక ఉద్యమాలు, పోరాటాల్లో ఆమె ముందు పీఠాన పాల్గొన్నారని తెలిపారు. ఆమె మృతి అంగన్వాడీలతో పాటు కార్మికుల లోకానికి ఎంతో తీరం లోటని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కోటేశ్వరరావు కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ .రాము పేర్కొన్నారు.

పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. కలెక్టరు కార్యాలయంలో సోమవారం వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కరపత్రాలను విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకానికి ప్రీమియం చెల్లింపు వలన 2024-25 రబీ సీజన్కు బీమా వర్తిస్తుందన్నారు. జిల్లాలో ఇ-పంటలో నమోదు చేయించుకున్న రైతులందరూ 2024-25 సంవత్సరం పంటకు బీమా ప్రీమియం చెల్లించడానికి అర్హులని పేర్కొన్నారు. గ్రామ వ్యవసాయ లేదా ఉద్యాన సహాయకుల వద్ద తీసుకున్న పంట నమోదు పత్రం, ఆధార్ కార్డు కాపీ, బ్యాంకు అకౌంట్ కాపీ, 1బి/పట్టాదారు పాస్ పుస్తకం కాపీతో సహా ఇన్సురెన్స్ ప్రీమియం మామిడిపంటకు ఎకరానికి రూ.2,200, మినుము పంటకు రూ.300, పెసరకు రూ.300 చొప్పున డిశంబరు 15వ తేదీలోగా చెల్లించాలన్నారు. వరి పంటకు ఎకరానికి రూ.630 చొప్పున డిశంబరు 31వ తేదీలోగా దగ్గరలో ఉన్న మీ-సేవా కేంద్రంలో ప్రీమియం చెల్లించాలని కోరారు. వరి,మినుము,పెసర పంటలకు సంబంధించి సందేహాలు ఉంటే బీమా కంపెనీ క్లస్టరు మేనేజరు ఫోన్ నెంబరుకు 9951142337 సంప్రదించాలని సూచించారు. మామిడిపంటకు బీమా పరిహారం రైతులకు వర్తించడానికి 2024 డిశంబరు 15వ తేది నుండి 2025 మే 31 మధ్య కాలంలో అకాల లేదా అధిక వర్షపాతం, గాలిలో తేమశాతం, వాతావరణ వ్యత్యాసం, అధిక గాలివేగం సంబంధించిన పరిమాణాలను పరిగణనలోకి తీసుకొని నష్టం వాటిల్లితే ఎకరానికి గరిష్టంగా రూ.44వేలు రైతు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖాధికారి జి. ప్రభాకర రావు, జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహనరావు, లీడ్ జిల్లా మేనేజరు (ఎల్ డి ఎమ్) కె. సత్యనారాయణ, టాటా ఎఐజి ఇన్సూరెన్స్ క్లస్టరు మేనేజరు పి. అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐద్వా నేతలు, మహిళలు

నూతన మద్యం పాలసీని రద్దు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

నూతన మద్యం పాలసీని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి డిమాండ్ చేశారు. అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయితీలో సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల మీద దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. మద్యం, గంజాయి అమ్మకాలు పెరగడంతో పిల్లలు ఎక్కువ గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజల మీద భారం పడుతుందన్నారు. మద్యాన్ని ప్రభుత్వం ఆదాయ వనరుగా చూడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు యు లోవ, శిరీష, సునీత, దుర్గ, రాణి, పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి రూ.2.30 లక్షల విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని శివాలయం నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత, కోకోకోల డ్రింక్స్ డిస్ట్రిబ్యూటర్, టిడిపి పెందుర్తి నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బోకం సత్యనారాయణ రూ.2,30 లక్షలు విరాళం అందజేశారు. విరాళం అందజేసిన బోకం సత్యనారాయణకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, చింతల శ్రీను, కోన సోమేశ్వరరావు, కొల్లి కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-యలమంచిలి : రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన విద్యార్థులు ధర్నా నిర్వహించారు. బస్ కాంప్లెక్స్ నుంచి ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహశీల్దార్ వినయ్కుమార్కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బాబ్జి మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు వెంటనే చెల్లించాలని, పిజి విద్యార్థులకు శాపంగా మారిన జిఓ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సింహాద్రి, ఇర్మియా, శ్యామల, కావేరి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవితో కలిసి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని స్వేచ్ఛగా అమ్ముకోవచ్చున్నారు. జాయింట్ కలెక్టర్ జాహ్నవి మాట్లాడుతూ పారదర్శకంగా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్థిక ఆయిషా, పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ పి.జయంతి, డీఎస్ఓ ఎవిఎస్ఎన్.మూర్తి, జెడి బి.మోహన్రావు, ఏడి సిహెచ్ రవీంద్రనాథ్, తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంపీడీవో సువర్ణరాజ్, వ్యవసాయ శాఖ అధికారి ఎల్ వై కాంతమ్మ, టెక్నికల్ అధికారి రవితేజ, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, మాజీ జడ్పిటిసి పోతల పాత్రు నాయుడు, ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మీ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జనసేన మండల అధ్యక్షులు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, బిజెపి నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు, చిత్రంలో జెసి, ఆర్డిఓ తదితరులు

కలెక్టరేట్ పిజిఆర్ఎస్కు 194 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి కలెక్టరేట్లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 194 వినతులు అందజేసారు. జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వైఎస్వికెజిఎస్ఎల్ సత్యనారాయణరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారం గూర్చి సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడి ఆదేశాలు జారీ చేసారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా, పెండింగు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూకు సంబంధించి 111, పంచాయతీరాజ్ 15, పోలీస్ 11, సర్వే సెటిల్మెంట్ 7, హౌసింగ్ కార్పొరేషన్ 6, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు 5 అర్జీలతోపాటు మిగిలిన శాఖలకు సంబంధించిన అర్జీలు కూడా వచ్చాయి.

ఎస్పి ఆఫీసులో 40 ఫిర్యాదులు....

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 40 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర అర్జీలు ఉన్నాయి. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించారు. సమస్యలను అడిగి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పి తుహిన్ సిన్హా

తెలుసుకున్నారు. చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్ మోహన్ రావు, ఎస్పై వెంకన్న పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ను వెంటనే నిర్మించాలి

అచ్యుతాపురం : పూడిమడక సముద్ర తీరంలో ప్రతిపాదించిన ఫిషింగ్ హార్బర్ పనులను వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టరేట్లో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్లో జిల్లా కలెక్టర్కు పూడిమడక గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని వెంకటరమణ విన్నవించారు. ఫిషింగ్ హార్బర్ లేకపోవడం వలన రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాలకు చెందిన మత్స్యకారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ఉప్పుటేరులో రసాయనిక వ్యర్థాలు విడుదలపై

మండలంలోని ఉప్పుటేరులో పరిశ్రమల రసాయనిక వ్యర్థాలు విడుదల చేయడంపై పూడిమడక గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని వెంకటరమణ జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. రెండు సంవత్సరాలుగా పరిశ్రమలు ఉప్పుటేరులోనూ, సముద్రంలోనూ విచ్చలవిడిగా రసాయనిక వ్యర్థ పదార్థాలు విడుదలతో మత్స్య సంపద అంతరించిపోతుందని, దీంతో సముద్రంలో చేపలు వేటాడి మత్స్యకారుల జీవనాధారం దెబ్బతింటుందని తెలిపారు. రసాయనిక వ్యర్థ పదార్థాలు విడుదల చేస్తున్న పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సుగర్ ఫ్యాక్టరీ ఆక్రమణలపై ఫిర్యాదు

అనకాపల్లి : అనకాపల్లి వివి రమణ సహకార చక్కర కర్మాగారం ఆక్రమణలపైనా, ఫ్యాక్టరీ ఎండి అవినీతి అసమర్థ పాలనపైనా సహకార చట్టం 51 సెక్షన్ ప్రకారం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫ్యాక్టరీ షేర్ హోల్డర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గొర్లి మోదు నాయుడు పబ్లిక్ గ్రీవెన్స్లో సోమవారం ఫిర్యాదు చేశారు.



వాల్ పోస్టర్ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రాంబిల్లి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా మహాసభ ఈ నెల 13, 14 తేదీల్లో యలమంచిలి ప్రాంతంలో జరుగుతుందని, దానిని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మహాసభ వాల్ పోస్టర్ను రాంబిల్లి ప్రభుత్వ పాఠశాలలో సిబిటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేవుడునాయుడు, డి.కాసియా, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.బాలాజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ నిరంతరం విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. రాంబిల్లి ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్, బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. రాంబిల్లో చదువుకొని ఖాళీగా ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్, రాజేష్, తరుణ్, శీను, గోపి, విద్యార్థులు పాల్గొన్నారు

ప్రజా దర్బార్లో తాతయ్యబాబు వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్తో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు వినతులు స్వీకరించారు. ఆ వినతులు సత్వరమే పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని నారాయుడుపాలెం గ్రామంలో సర్వే నెంబర్ 100/7లో గల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన కోన అచ్చియ్య నాయుడుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిటి శేషు కుమార్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ సుమారు 0.80సెంట్లు ప్రభుత్వ భూమి గ్రామ అవసరాల నిమిత్తం కళ్యాణ మండపం, రైతు భరోసా కేంద్రం, ఏఎన్ఎం సబ్ సెంటర్, గ్రంధాలయం వంటి నిర్మాణాలు చేపట్టవలసి ఉందని తెలిపారు. ఇప్పటికే వీటి నిర్మాణాలకు పంచాయితీ తీర్మానాలు చేసి నిధుల కోసం ఎమ్మెల్యే, ఎంపీకి విన్నవించినట్లు చెప్పారు. ఈ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుకొండ వెంకటరాజు, కొయ్య చక్రం, కొయ్య రమణ, ఎర్ర రాము, కొయ్య సేసు, దాసరి సంతోష్, దాసరి గోపాల కృష్ణ, మొల్లి సంతోష్, నెల్లి పోతురాజు, కాకర రాజు, యలమంచిలి గోవింద, సబ్బి శ్రీనివాస్ యాదవ్, కందిపల్లి అప్పలరాజు, కర్రి శ్రీను, కే.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కేపీ అగ్రహారంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని బుచ్చయ్యపేట మండలం ఎంపిటీసీల ఫోరం అధ్యక్షులు, పి.భీమవరం ఎంపిటీసీ దేవర అప్పారావు ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు మండల కేంద్రంలోని శివాలయం వద్ద సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్చార్జి పడాల కొండలరావు, మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం ప్రభుత్వం ఆస్పత్రి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ సోనియాగాంధీ ఇటువంటి పుట్టినరోజు వేడుకలు ఎన్నో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్, కోటి, రొంగలి నాయుడు బాబు, గౌరు నాయుడు, పరదేశి నాయుడు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ప్రియాంక దండి ఆధ్వర్యంలో సోమవారం ఇసుకతోట వద్ద ఘనంగా జరిగాయి. కార్యకర్తలు కేక్ కట్ చేసి సందడి చేశారు. అనంతరం రామ్నగర్లో ఉన్న ఎ.ఎస్.రాజా రక్తదాన కేంద్రంలో పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు కాండవ గాయత్రి, మెహర్, నాగరాజు, వెంకటేష్ దేవర, ప్రసాద్, రమణ, ఇసుకతోట మినీ వ్యాన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన తనయ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని నాగులాపల్లి గ్రామంలో మృతి చెందిన తల్లికి ఆమె కుమార్తె దహన సంస్కారాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భీమరశెట్టి లక్ష్మి (80) సోమవారం మృతి చెందారు. లక్ష్మీకి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారులు లేకపోవడంతో మునగపాకకు చెందిన పెద్ద కుమార్తె కాండ్రేగుల సత్యవతి తల్లికి తలకొరివి పెట్టారు. కాగా అల్లుళ్ల అత్త పాడె మోసి కొడుకులు లేని లోటు తీర్చారు.

రేషన్ కందిపప్పు కొందరికేనా?

▸▸ అసహనం వ్యక్తం చేస్తున్న కార్డుదారులు



కొండల అగ్రహారంలో బారులు రేషన్‌కార్డుదారులు

ప్రజాశక్తి-కోటవురట్ల :కందిపప్పు కొందరికేనా! అందరికీ ఇవ్వరా? అంటూ ఎండిఎం వాహన నిర్వాహకులను రేషన్‌కార్డుదారులు నిలదీస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో అన్ని నిత్యావసరాలతోపాటు కందిపప్పు ధర కూడా విపరీతంగా పెరగడంతో, ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు రూ.70కే కిలో కందిపప్పు ఇచ్చేలా చర్యలు చేపట్టింది, రెండు మూడునెలలుగా రేషన్ వాహనాల వద్ద బియ్యం, పంచదారతోపాటు కందిపప్పును కూడా పంపిణీ చేస్తున్నారు. అయితే ఇది అన్ని డిపోల్లో, అందరికీ అందని పరిస్థితి ఉండడంపై పలువురు రేషన్‌కార్డుదారులు ఎండిఎం నిర్వాహకులను నిలదీస్తున్నారు. దీనిపై లబ్ధిదారులను ప్రశ్నిస్తే, గత నెలలె కూడా అందరికీ కందిపప్పు ఇవ్వలేదని, ఈనెలలో కూడా కొందరికి వచ్చిందని రేషన్ నిర్వాహకులు చెబుతున్నారని, ఇలాగైతే ముందు వచ్చిన వారికే కందిపప్పు అందుతుంటే మిగిలిన వారి పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో కందిపప్పును సరఫరా చేయాలని, అందరికీ అందేలా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంత వాసులు కోరుకుంటున్నారు.

అదానీతో అవినీతి బంధాన్ని బట్టబయలు చేయాలి



నర్సీపట్నంలో ధర్నా చేస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : దేశ సంపదను బడా కంపెనీలకు దోచిపెట్టి, అవినీతిని దాచిపెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్ చేసింది. అవినీతి ఆదానీతో కేంద్రానికి ఉన్న స్నేహ బంధాన్ని బట్టబయలు చేయాలని కోరారు. సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ మాట్లాడుతూ, సౌర విద్యుత్ ఒప్పందాల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై అమెరికాలోని న్యూయార్క్ ఈస్టన్ డిస్ట్రిక్ట్ కోర్టులో ఆదానీపై అవినీతి కేసు నమోదైందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని, గత రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలనికోరారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి గురు బాబు, ఎఐటియుసి నేత ఎఎల్‌వి.రమణ, జిల్లా సమితి సభ్యులు జి.రాధాకృష్ణ, కామిరెడ్డి లక్ష్మి, మండల కార్యదర్శులు మేకా భాస్కరరావు, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, జోగిరాజు, సోడే శ్రీనివాసరావు పాల్గొన్నారు

అనకాపల్లి : అదాని అవినీతికి కొమ్ముకాస్తున్న మోడీ ప్రభుత్వం తక్షణమే గద్దె దిగాలని కోరుతూ అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్‌లో సిపిఐ ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. అదాని గ్రూప్ కంపెనీల అవినీతి, తప్పిదాలు, క్రోని క్యాపిటలిజాన్ని ప్రోత్సహిస్తున్న మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలని, ఇందుకోసం జాయింట్ పార్లమెంటరీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, కే సన్యాసిరావు, వైఎన్.భద్రం, చెల్లూరి నాగరాజు, కోరిబిల్లి శంకర్రావు, ముక్కామల చిన్ని, కొండూరు వీరాచారి, మత్తుర్తి సూరిబాబు, కెవి రమణ, నరాల శెట్టి సత్యనారాయణ, వీరు యాదవ్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : అదానీ కంపెనీల అవినీతిపై పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తక్కువ గ్రేడ్ గల బొగ్గును ఎక్కువ నాణ్యత కలిగిన బొగ్గుగా చూపించి ధరలను అమాంతం పెంచి ప్రభుత్వ రంగ సంస్థలకు అమ్మడం వల్ల దేశ ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడుతోందని తెలిపారు. సెకీతో ఒప్పందాలు అడ్డగోలుగా సాగాయన్నారు. నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రూ.1700 కోట్లు ముడుపులు ముట్టాయని ఆరోపణలు వస్తున్న నేథ్యంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని కోరారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జిఎస్‌జె.అచ్యుతరావు, ఎస్‌కె.రెహమాన్, కె.సత్యాంజనేయ, పి.చంద్రశేఖర్, ఎం.మన్మధరావు, ఆర్.శ్రీనివాసరావు, జి.రాంబాబు, సిఎస్.క్షేత్రపాల్, ఎ.దేముడమ్మ పాల్గొన్నారు.

రైస్‌మిల్లు ధూళితో ఇబ్బందులు

▸▸ ఆందోళనలో ప్రయాణికులు, విద్యార్థులు



రైస్ మిల్లు చుట్టూ కమ్ముకున్న ధూళి

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల కేంద్రం సమీపంలోని లింగాపురం సెంటర్ వద్ద గల ప్రయివేటు రైస్ మిల్లు నుంచి వస్తున్న ధూళితో ఇబ్బందులు పడుతున్న పయాణికులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారిని అనుకుని రైస్ మిల్లు ఉండడంతో నిత్యం దుమ్ము, ధూళి రేగుతూ, రోడ్లను కమ్మేస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పూర్తిగా కనబడని స్థితిలో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువుర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు రైస్ మిల్ సమీపంలోనే ఆదిత్య, విద్యాంజలి స్కూల్ ఉండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఏడాది పొడుగునా పనిచేస్తున్న రైస్‌మిల్లు నుంచి నిత్యం ధూళి ఎగురుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైస్‌మిల్లు నుంచి ధూళి రోడ్లపైకి రాకుండా తగు చర్యలు చేపట్టాలని, తద్వారా ప్రజల ఇబ్బందులు, ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.


భూసమస్యలపై రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవిన్యూ సదస్సుకు మంచి స్పందన లభించింది. పలువురు రైతులు భూసమస్యలపై వినతిపత్రాలు అందించారు. డిప్యూటీ తహశీల్దార్ నరేంద్ర, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొని, రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా 22ఏ సమస్యలను పరిష్కరించాలని ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు వెల్లడించారు. **నక్కపల్లి** :మండలంలోని ఉద్దండపురంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసిల్దార్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పట్టాదార్ పాస్ పుస్తకాలు, వెబ్‌ల్యాండింగ్,సర్వే చేసిన భూములకు పాసుపుస్తకాలు జారీ, తదితర సమస్యలపై పలువురు అర్జీలను రెవెన్యూ అధికారులకు అందజేసారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరరావు, డిటి అన్నాజీ రావు, ఆర్‌ఐ కన్నబాబు, సర్వేయర్ సత్తిబాబు పాల్గొన్నారు.

గొలుగొండ :మండలంలోని సిహెచ్.నాగాపురం, కుమారపురం గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్గొనిరైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నాగరాజు, నాగాపురం సర్పంచ్ రఘురామ్, మాజీ సర్పంచ్ రామారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని కొమరవోలు గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ సిహెచ్.నాగమ్మ పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శంకర్, రెవెన్యూ అధికారి రామ్మూర్తి, విఆర్‌ఓ రాజులనాయుడు, సర్పంచ్ గొర్లె చల్లమ్మనాయుడు పాల్గొన్నారు.

కశింకోట :మండలంలోని చింతలపాలెం, గొబ్బూరు గ్రామాల్లో కశింకోట మండల తహశీల్దారు అడబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. కార్యక్రమంలో జనసేన నాయకులు మళ్ల వెంకట రమణ (బాబు), మండల సర్వేయరు రామారావు, డిప్యూటీ తహశీల్దారు భాస్కర్, సెక్రటరీ ప్రేమ్ కుమార్, విఆర్‌ఓ నాయుడు బాబు, సచివాలయం సర్వే ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ బల్ల అప్పలకొండ, మాజీ సర్పంచ్‌లు కర్రి దుర్గనాయుడు, మేడిశెట్టి వెంకటరమణ, జెర్రిపోతుల నూకునాయుడు, కోన రమణ, ఆనాల తాతీలునాయుడు, తెరపల్లి శ్రీను పాల్గొన్నారు.



కశింకోటలో వినతులు స్వీకరిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

పరవాడ : మండలంలోని భరిణికం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు పాల్గొని మాట్లాడారు. ఎటువంటి రెవెన్యూ సమస్యలున్నా అర్జీలు పెట్టుకుంటే నెల రోజులు తర్వాత కచ్చితంగా పరిష్కారం చూపిస్తామని తెలిపారు.

బుచ్చయ్యపేట : మండలంలో గల కెపి అగ్రహారం, కొండపాలెం గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎం లక్ష్మీ మాట్లాడుతూ ఇటీవల జరిగిన రీ సర్వేల్లో లోపాలు ఉన్నట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు ముచ్చకర్ల తాతీలు, గోపిశెట్టి శ్రీనివాసరావు, ఎంపిటీసీ దేవర అప్పారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి : జీవీఎంసీ 84వ డివిజన్ కొండకొప్పాకలో సోమవారం తహశీల్దార్ విజయ్ కుమార్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, 84వ డివిజన్ కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి, డివిజన్ టిడిపి ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు మాట్లాడారు. కొప్పాకలో హైస్కూల్ కోసం గతంలో టిడిపి ప్రభుత్వం 5 ఎకరాలు కేటాయిస్తే, అందులోని ఒక ఎకరా భూమిని వైసిపి నాయకులు ఆక్రమించుకొని ఇళ్లు నిర్మాణం చేసుకున్నారని తెలిపారు. వాటిని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రమేష్, వీఆర్వో బోయిన మురళి, వామాల కాశీ, వానపల్లి పాపారావు, గోపి, శ్రీను ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అయ్యన్నపాలెంలో సోమవారం జరిగిన రెవిన్యూ సదస్సులో భూ సమస్యలపై 10 అర్జీలు అందినట్లు స్థానిక డిప్యూటీ తహసీల్దార్ సిహెచ్ అప్పారావు తెలిపారు. అర్జీలను దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుదిరెడ్ల లక్ష్మి కనకరాజు, ఆర్‌ఐ వీరయ్య, అయ్యన్నపాలం వీఆర్వో ఎం గోవిందరావు, వంగలి-2 వీఆర్వో ఎస్. కామరాజు, మల్లనాయుడుపాలెం వీఆర్వో కె. శేఖర్‌రావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని కింతాడ గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. భూ సమస్యలపై 27 మంది రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దారు పి.భాగ్యవతి, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, ఉప సర్పంచ్ బండారు ముత్యాల నాయుడు, టిడిపి నేతలు కన్నూరు సూర్యనారాయణ, బండారు నరసింహ నాయుడు, పల్ల రాజేష్, బండారు సత్యనారాయణ పాత్రుడు, వీఆర్వోలు విజయ శ్రీ, జగదీష్, ఆనంద్, సునంద, రూప పాల్గొన్నారు.

తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డులో ఉన్న సచివాలయంలో తహశీల్దార్ పైలా రామారావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. చిట్టివలస పెద్ద చెరువుపై సమగ్ర సర్వే జరిపి ఆక్రమణలు ఉంటే తొలగించాలని మాజీ కౌన్సిలర్ పిట్ట సురేష్ కోరారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం గాకుండా కాపాడాలని కోరారు. మాజీ కౌన్సిలర్లు పిట్ట వెంకటరావు, బడిగింటి నీలకంఠం, చేట్ల రమణ తదితరులు పాల్గొన్నారు

మధురవాడ : కొమ్మాదిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పేద, దళిత రైతులు సమస్యలపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) నాయకులు వినతి పత్రాలు అందించారు. కొమ్మాది, రేవళ్లపాలెం, బక్కన్నపాలెం గ్రామాల రైతుల నుంచి తీసుకున్న భూములకు ఎటువంటి నష్ట పరిహారమూ ఇవ్వలేదని, ఇస్తామన్న ఇళ్లు కూడా అప్పగించలేదని డీటీకి వివరించారు. ఆ భూములకు పాసు పుస్తకాలిచ్చి, 22ఎ నుంచి తొలగించి రైతులకు హక్కు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.పైడితల్లి, మధురవాడ జోన్ కమిటీ ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు, దళిత సంఘాల నాయకులు సియ్యాద్రి కనకరాజు, స్థానికులు ఎస్ రాజు, నరసియ్యమ్మ, అప్పారావు, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని పొట్నూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 127 దరఖాస్తులు వచ్చినట్లు పద్మనాభం తహశీల్దార్ కె.చంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ వద్ద నిత్యం రద్దీనే!

▸▸ అవస్థలు పడుతున్న వాహనదారులు
▸▸ రిటైల్ వ్యాపారుల వల్లే పడిగాపులు



అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల వ్యాప్తంగా ఉన్న ఏకైక పెట్రోల్ బంక్ వద్ద నిత్యం రద్దీగా ఉండడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ పనులపై వెళ్లేవారు, ఉద్యోగులు, వ్యాపారులు, సహా ఇతర ప్రజలు తమ వాహనాలకు పెట్రోల్ నింపేందుకు బంక్‌ల వద్ద బారులుదీరి పడిగాపులు పడక తప్పని పరిస్థితి ఉందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ బంకు నుంచి ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు రిటైల్‌గా తమ గ్రామాల్లో అమ్ముకునేందుకు ఆయిల్ క్యాన్లలో ఆయిల్ ఫిల్లింగ్ చేసుకుంటూ ఉండడంతో మరింత ఆలస్యం అవుతుంది, దీంతో వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు, వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లో పెట్రోల్ బహిరంగ విక్రయాలను బంకు యజమానులే అడ్డుకోవాల్సిన స్థితిలో వారే వ్యాపారులు ప్రోత్సాహిస్తున్నారని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, బంక్ వద్ద రద్దీని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కనకదుర్గమ్మ ప్రచార రథం ఊరేగింపు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఎఎల్.పురం గ్రామానికి సోమవారం విజయవాడ కనకదుర్గమ్మ రథం వచ్చింది. ఎఎల్.పురం కనకదుర్గమ్మ ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు కనకదుర్గమ్మ రథం ర్యాలీ సాగింది. భక్తులు రథం ముందు నీళు పోసి పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చిటికెల తారకవేణుగోపాల్, కెడిపేట ఎస్‌ఐ తారకేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

11న పోర్ట్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ

వార్షికోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సొసైటీ 85వ వార్షికోత్సవాన్ని ఈనెల 11న విశాఖ పోర్టు సాంబమూర్తి ఆడిటోరియం నిర్వహించనున్నామని సొసైటీ అధ్యక్షులు ఎం.శ్రీరామ్మూర్తి తెలిపారు. వేడుకల్లో పోర్ట్ అథారిటీ చైర్ పర్సన్ అంగముత్తు పాల్గొంటారని, ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ,1939లో 21 మంది సభ్యులతో ప్రారంభించబడిన సొసైటీ, ప్రస్తుతం 1900 మంది సభ్యులతో రూ.125 కోట్ల టర్నోవర్‌తో నడుస్తుందన్నారు. ఉద్యోగ, పొదుపు సహకార సంఘాలలో అత్యంత ప్రాముఖ్యత గల సంఘంగా రాష్ట్రంలోనే గుర్తింపు ఉందన్నారు. ఏ కేడర్‌లో ఉన్నా, ప్రతి సభ్యునికీ పది శాతం వడ్డీతో రూ.15 లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నామన్నారు. రుణగ్రహీతలైన సభ్యులు మరణిస్తే, ఆ భారాన్ని ష్యూరిటీదారులు, కుటుంబీకులపై వేయకుండా సొసైటీయే భరిస్తున్న దేశంలోని ఏకైక సహకార సొసైటీ అన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా 30 శాతానికి తగ్గకుండా డివిడెండ్ ఇస్తున్న ఏకైక సంఘం పోర్టు కోఆపరేటివ్ సొసైటీ అన్నారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు సిహెచ్ బాలాజీరావు, డైరెక్టర్లు జి.చంద్రరావు,ఆర్. సురేష్ కుమార్,కె శోభన్ బాబు,కె.వీరాంజనేయరావు పాల్గొన్నారు.

'సన్' కాలేజీపై చర్యలు చేపట్టండి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా
కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పెందుర్తి సుజాతనగర్‌లో గుర్తింపు లేకుండా నడుపుతున్న సన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ సైన్సెస్ కాలేజీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్‌జె నాయుడు,జి.రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెందుర్తి సుజాతనగర్‌లోని సన్ ఇన్స్టిట్యూట్‌కు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు లేకుండా అనధికారంగా అగ్రికల్చర్, ఫిజియోథెరపీ, పారా మెడికల్ కోర్సులను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఫేక్ డిగ్రీలు, అవినీతి కేసుల్లో గుర్తింపు రద్దయి, బ్లాక్ లిస్టులో ఉన్న రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ పేరుతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చి మోసం చేస్తున్నారని ఆరోపించారు..కాలేజీ యాజమాన్యం సొంతంగా పరీక్ష పేపర్ తయారు చేసి, కాలేజీలోనే నిత్యం పరీక్షలు నిర్వహిస్తుందని, విద్యార్థులను చేర్చుకొని యూనివర్సిటీ పరీక్షలు కూడా నిర్వహించకుండా విద్యార్థుల నుంచి రూ. లక్షల్లో ఫీజులు అడ్డదారిలో వసూలు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు ఎటువంటి తరగతులు గానీ, ల్యాబ్‌లు గానీ నిర్వహించకుండా వేలల్లో ఫీజులు వసూలు చేస్తుంటే ప్రభుత్వ అధికారులు, ఆర్‌జెడి, యూనివర్సిటీ అధికారులు పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ఫిజియోథెరపీ విద్యార్థులు కాలేజీలో చేరి 11 నెలలు గడుస్తున్నా, వారికి తరగతులు గాని పరీక్షలు గాని నిర్వహించలేదన్నారు.

అగ్రికల్చర్ విద్యార్థులను మేనేజ్మెంట్ కోటా పేరుతో నేరుగా చేర్చుకోగా, బిపిటి విద్యార్థులు కౌన్సిలింగ్ ద్వారా చేరినప్పటికీ కౌన్సిలింగ్‌లో చెప్పిన ఫీజు కంటే అదనంగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫిజియోథెరపీలో నైపుణ్యం గల సిబ్బంది లేరన్నారు. కాలేజీకి ప్రిన్సిపల్ కూడా లేరని, అడ్మిషన్స్ సమయంలో చెప్పినట్లుగా కెజిహెచ్‌కు తీసుకెళ్లి ప్రత్యేక క్లాస్‌లు నిర్వహిస్తామన్న ప్రకటన కూడా అమలు చేయడం లేదన్నారు. రేకుల షెడ్డులో కాలేజీని నిర్వహిస్తున్న సరైన వసతి, పరికరాలు లేకుండా రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న సన్ కాలేజీ యాజమాన్యం చర్యలపై తగు చర్యలు చేపట్టాలన్నారు. వినతిపత్రం స్వీకరించిన జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ స్పందిస్తూ, దీనిపై కమిటీ వేసి విచారణ జరిపిస్తామని, విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు గుణ, ప్రభుదాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- మాడుగుల : ఈనెల 20 నుండి 22 వరకు నర్సీపట్నంలో జరిగే సిపిఎం 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మాడుగుల మండల కార్యదర్శి ఇర నరసింహమూర్తి, నాయకురాలు కె.భవాని కోరారు. సోమవారం స్థానిక బస్‌స్టాండ్ ఆవరణలో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ౩ మూడు సంవత్సరాలకు ఒక్కసారి జరిగే సిపిఎం మహాసభలకు నర్సీపట్నం వేదిక కానుందని, ఈనెల 20. 21. 22. తేదీలలో జరుగుతున్న సిపిఎం అనకాపల్లి జిల్లా మహాసభల జయప్రదానికి ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ మహాసభల్లో నూతనంగా ఏర్పడ్డ అనకాపల్లి జిల్లాను సమగ్ర అభివృద్ధి చేయాలని, సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి, ఆధునికీకరించాలని, జీడి పంటకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదోవ షెడ్యూల్ లో చేర్చాలని, ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, పరిశ్రమల్లో ప్రమాదాలు అరికట్టాలని స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, విశాఖ డెయిరీ జరిగిన అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని, విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపాలని, యువతకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు విస్తారంగా పెట్టి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని, ఎన్నికల ముందు అంగన్వాడీ ఆశ మధ్యాహ్న భోజన కార్మికులకు ఐకెపి అన్ని రకాల స్కీంవర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు, జిల్లాలోని భూ కుంభకోణాలపై దర్యాప్తు, పేదలు సాగులో ఉన్న పోడుభూములకు, బంజరు, సీలింగ్ భూములకు సాగుహక్కు పట్టాలు ఇవ్వాలని వృత్తిదారులకు రక్షణ కల్పించి రుణాలు మంజూరు చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ ఉపాధ్యాయులను పర్మినెంట్ చేయాలని తదితర అనేక సమస్యలపై మూడు రోజులపాటు మహాసభల్లో చర్చించి, దీనిపై తీర్మానాలు, భవిష్యత్తు పోరాట కార్యాచరణ ఖరారు చేస్తారన్నారు జిల్లాలోని 24 మండలాల నుండి 500 మంది ప్రతినిధులు, రాష్ట్ర నాయకులు మహాసభలకు రానున్నారని, జయప్రదానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్. ఘాటీలు. పి. జగన్నాధరావు. ఎం.అప్పారావు. వి.అయ్యప్ప. సిహెచ్.సత్యనారాయణ, కె.నూకరాజు పాల్గొన్నారు.

నీటి సరఫరా, ఇంజినీరింగ్ కార్మికులను గుర్తించాలి

జివిఎంసి కమిషనర్‌కు సిఐటియు వినతి



జివిఎంసి కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలోని వాటర్‌సప్లై, చైన్ ఇంజనీరింగ్ కార్మికులను గుర్తించాలని, వారిని ఆప్కాస్‌లో విలీయం చేసి వేతనాలు చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు కోరారు. సోమవారం సాయంత్రం యూనియన్ ప్రతినిధి వర్గంతో వచ్చి జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. జివిఎంసిలో ఖాళీ అయ్యే పోస్టులను, కార్మికుల వారసులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని విభాగాల్లో మంజూరైన పోస్టులతోపాటు, ఉద్యోగ విరమణ, మరణాల వల్ల ఖాళీ అయిన స్థానాల్లో గతంలో కౌన్సిల్, కలెక్టర్ ఆమోదంతో స్క్రూటినీ కమిటీ ద్వారా పారదర్శకంగా నియామకాలు జరిగేవని, అదే విధానాన్ని కొనసాగించాలని కోరారు.గత కౌన్సిల్‌లో చర్చకు వచ్చిన ఇన్‌కం టాక్స్ అంశం కార్మికుల అకౌంట్‌లో నేరుగా జమ చెయ్యాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, జె.అర్ నాయుడు, ఇ.ఆదినారాయణ, వాటర్ సప్లై ఇంజనీరింగ్ కార్మికులు వెంకటరావు, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

సిఆర్‌పిఎఫ్ బెటాలియన్‌ను సందర్శించిన ఆదివాసీ యువత



బెటాలియన్ సందర్శనలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ యువత

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : గీతం వేదికగా జరుగుతున్న 16వ జాతీయ గిరిజన యువజన సమ్మేళనంలో పాల్గొన్న ఒడిశా; ఛత్తీస్‌గఢ్‌లోని ఐదు జిల్లాలకు చెందిన ఆదివాసీ యువత సోమవారం నగరంలోని 198వ సిఆర్‌పిఎఫ్ బెటాలియన్‌ను సందర్శించారు. అక్కడి సిబ్బందితో భేటీ అయ్యారు. సిఆర్‌పిఎఫ్‌కు చెందిన వివిధ ఆయుధాలు, వాటి వినియోగం గురించి అక్కడి సిబ్బంది యువతకు వివరించారు జాతీయ గిరిజన యువజన సమ్మేళనంలో భాగంగా హెచ్‌పిసిఎల్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను కూడా సందర్శించారు. వివిధ వృత్తి విద్యల్లో శిక్షణ వివరాలను ఆదివాసీ యువతకు అధికారులు వివరించారు. అనంతరం సింహాచలం వరాహలక్ష్మీ నసింహస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం సాగర్ తీరంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. యోగా శిక్షణ తరగతుల్లో ఆదివాసీ యువత పాల్గొంది. నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అధికారి గొర్లె మహేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఎన్‌వైకె అధికారి కె.వెంకట ఉజ్వల్, ఎఒ వృధ్వీ, అల్లం రాంప్రసాద్, ప్రసన్న, శ్వేత, ఎన్ఎస్ఎస్ ప్రెసిడెంట్ అవార్డుగ్రహీత ఆర్. లీలా ప్రసాద్, వాలంటరీలు జేమ్స్, జ్ఞానదీప్, వినయ్ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



కొడవటిపూడిలో సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-కోటవురట్ల : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో వీధుల్లో అభివృద్ధి పనులు నిర్వహించడంలో కొత్త కాంతులతో దర్శనమిస్తున్నాయి, కొడవటిపూడి గ్రామంలో ప్రధాన రహదారిని అనుకుని ఉన్న కొండ ప్రాంతానికి రూ.15 లక్షలతో 11 సిసి రోడ్లు మంజూరయ్యాయి ఆయా పనులు చురుగ్గా సాగుతుండడంలో ఆ ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు గతంలో కొండపైకి వెళ్లేందుకు ఇబ్బందులు పడే వాళ్ళమని, ఇపుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీధి రోడ్ల నిర్మాణం చేపట్టడంతో రాత్రివేళల్లోనూ రాకపోకలకు ఇక్కట్లు లేకుండా ప్రశాంతంగా చేరుకునే పరిస్థితులు నెలకొంటున్నాయని ఆయా ప్రాంతవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తకోటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు హామీని

తక్షణమే అమలు చేయాలి



మాట్లాడుతున్న సిపిఎం నేత గోవిందరావు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చోడవరం నియోజకవర్గంలో అతి పెద్ద గ్రామంగా ఉన్న కొత్తకోటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని గత ఎన్నికలలో వాగ్దానాలు చేసిన పాలకులు, తక్షణమే ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే రోలుగుంట, రావి కమతం మండలాల పరిధిలో ఉన్న అనేక మంది పేద విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి ఉపయోగపడు తుందన్నారు. ముఖ్యంగా డిగ్రీ కళాశాల అందుబాటులో లేకపోవడం వల్ల సుదూర ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితిలో పేద, గిరిజన విద్యార్థులు మధ్యలోనే చదువులు మాని నిరుద్యోగులుగా మిగులుతున్నారని గోవిందరావు ఆందోళన వ్యక్తం చేశారు. డిగ్రీ చదవాలంటే నర్సీపట్నం, చోడవరం వెళ్లాల్సిన స్థితిలో బాలికల ఇబ్బందులు పడుతున్నా రన్నారు. దీంతో అనేకమంది చదువులు ఉన్నతస్థాయికి చేరుకోలేక అర్థాంతరంగా ముగుస్తున్నాయని ఆవేదన వెలి బుచ్చారు. ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాల మేరకు తక్షణమే కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీకాలేజీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, లేకుంటే సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని గోవిందరావు స్పష్టం చేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



ప్రోటీన్ ఫుడ్ ఇస్తున్న డాక్టర్

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : స్థానిక ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు నర్సీపట్నం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మందిరం కన్వీనర్ రామకృష్ణ మాస్టారు సౌజన్యం తో సోమవారం ప్రోటీన్ ఫుడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ నినాదంతో చేపడుతున్న సేవా కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రిలోని గర్భిణులకు ప్రోటీన్ ఫుడ్ అందించామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద సిబ్బంది రత్నకుమారి, కనకరాజు, దాతలు నెల్లూరు వెంకట రమణ దంపతులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.